క్లుప్తంగా

ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

మంగళగిరి: వినాయక చవితి పండుగను ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ఏడాది వినాయకుడి దయతో ఎలాంటి విఘ్నాలు లేకుండా రైతులు వంటలు సాగు చేయాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

మేళాలో 54 మందికి ఉద్యోగాలు



ఫిరంగిపురం: మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ 12 కంపెనీల ద్వారా ఉద్యోగఅవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు 142 మంది పాల్గొనగా వారిలో 54 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేసినట్లు ఎంపీడీవో పి.శివసుబ్రహ్మణ్యం తెలిపారు.

చవితి ఉత్సవాలు శాంతి యుతంగా నిర్వహించాలి

సీఐ శివరామకృష్ణ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారితో సీఐ శివరామకృష్ణ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, శాంతియుతంగా నిర్వహించుకోవాలని చెప్పారు. విగ్రహం ఎత్తు, నిమజ్జనం చేసే తేదీ, ఊరేగించే మార్గం, వాహనం, డ్రైవర్ వివరాలు తెలియజేయాలని చెప్పారు. మండపాల వద్ద ప్రథమ చికిత్స కిట్లు, అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలు, వలంటీర్ డ్యూటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఫ్లెక్సీలు, అశ్లీల నృత్యాలు లేకుండా చూడాలని చెప్పారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లిరూరల్: మంగళగిరి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి రూరల్ ఉండవల్లి దళితవాడలో తాగునీటి పైపులు లీక్ అవుతున్నాయంటూ సోమవారం సాక్షిలో 'పైపులైనుకు లీకేజీ.. పట్టని అధికారులు' పేరుతో వచ్చిన కథనానికి స్పందించిన ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా పైపులైన్లకు తమ సిబ్బంది చేత వెంటనే మరమ్మతులు నిర్వహించారు. ఎక్కడైనా తాగునీటి పైపులైన్ లీక్ అయితే తమ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుగ్గిరాల: రానున్న మూడు రోజుల్లో రైతు సేవా కేంద్రాలు, సొసైటీలకు 200 మెట్రిక్ టన్నులు యూరియా, డీఏపీ అందుబాటులోకి వస్తుందని ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. మంగళవారం ఏవో విజయబాబు, తహసీల్దారు ఐ.సునీత, పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీలను, ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏవో ఆర్.విజయబాబు మాట్లాడుతూ తనిఖీలలో భాగంగా యూరియా 63, డీఏపీ 132 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, మండలంలోని కంఠంరాజుకొండూరు గ్రామంలో పురుగు మందుల దుకాణంలో సరైన ప్రొవిజినల్ సర్టిఫికెట్లు లేని రూ.1.86 లక్షల విలువ గల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో విస్తరణాధికారి సీహెచ్ ప్రజ్ఞాన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారుణ్యమూర్తి మదర్ థెరిస్సా

దుగ్గిరాల: పేద ప్రజలకు ప్రేమతత్వాన్ని పంచుతూ సేవ చేసిన కారుణ్యమూర్తి మదర్ థెరిస్సా అని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ సుభాని పేర్కొన్నారు. థెరిస్సా జయంతిని మంగళవారం దుగ్గిరాల జెండా సెంటర్ వద్ద నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. షేక్ సుభాని మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తికి థెరిస్సా సేవలు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రషీద్, జిలానీ, మస్తాన్, పి.యోహోను, జాన్ షైదా, బాజీ బాబా, బి.యేల్లేశ్వరావు, కాకా వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తొలి పూజకు సిద్ధమవుతున్న ప్రజలు



ఉండవల్లి సెంటర్‌లో పత్రి, వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న ప్రజలు



పాతమంగళగిరి జెండా చెట్టు సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

- పలు కూడళ్లలో విగ్రహాల ఏర్పాటు
- పత్రి, విగ్రహాల కొనుగోలులో ప్రజలు

మంగళగిరి: తొలి పూజ వినాయక చవితి పండుగను ఆనందంగా, ఉత్సాహంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. వినాయక చవితి పండుగకు అవసరమైన పత్రి, విగ్రహాలు, పూజా సామగ్రి కొనుగోలుదారులతో మంగళవారం మధ్యాహ్నం నుంచే మెయిన్‌బజార్, మిద్దె సెంటర్‌లు కళకళలాడుతున్నాయి. పర్యావరణాన్ని రక్షించండి.. మట్టి విగ్రహాలను వాడండి అంటూ రోటరీ క్లబ్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ ప్రేమికులు మట్టి విగ్రహాలనే కొనుగోలు చేస్తున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో యువకులు కమిటీలుగా ఏర్పడి భారీ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నగరంలో వివిధ కూడళ్లలో విగ్రహాల ఏర్పాటుకు 50కుపైగా కమిటీలు అధికారుల నుంచి అనుమతి తీసుకున్నాయి. ఇక వినాయక చవితి సందర్భంగా పత్రి, పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పత్రి రెండు మామిడి ఆకులు, గరిక పెట్టి రూ 50కు, కొబ్బరి కాయలు సైతం కాయ రూ.10–20 పెంచారు. పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటినా భక్తులు తమ స్థాయిలో ఉన్నంత వరకు కొనుగోలు చేసి తొలి పండుగ వినాయక చవితి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేందుకు భక్తులు సిద్ధమయ్యారు.

బాబు హామీలకు ష్యూరిటీ లేదు



క్యూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త డీవీఆర్ తదితరులు

వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి

కాజ(మంగళగిరి): ముఖ్యమంత్రి చంద్రబాబు హామీలకు ష్యూరిటీ ఉండదని, బాబు హామీలపై ప్రజలకు నమ్మకం లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం రాత్రి బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు నాలి వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాదిన్నరలోనే తన మోసాన్ని ప్రజలకు తెలియజేశారని ఎద్దేవా చేశారు. రెండు, మూడు పథకాలు అరకొరగా ప్రవేశ పెట్టి సూపర్ సిక్స్ పథకాలు పూర్తయ్యాయని చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. అర్హులైన దివ్యాంగులు, వృద్ధుల పెన్షన్‌లు కట్ చేసి వారిని ఇబ్బంది పెట్టడం దుర్మార్గమన్నారు. తొలుత మహానేత డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొమ్ము శంకరరెడ్డి, శేషు, సుధాకర్ రెడ్డి, విజయ్‌బాబు, బ్రహ్మయ్య, కె.భూషణం, షేక్ గౌస్, ఎ.నాగేశ్వరరావు, యర్రబాలెం గౌస్, కోటిరెడ్డి, కందుల సుబ్బారావు, మధు, శ్యామల శ్రీనివాస్‌రెడ్డి, శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ లైసెన్స్‌కు స్పందించని వ్యాపారులు

- సిండికేట్‌లో ప్రధాన భూమిక పోషిస్తున్న టీడీపీ నాయకులు
- 29 వరకు లైసెన్స్ దరఖాస్తుల గడువు పెంపు



మంగళగిరి: టీడీపీ నాయకుల దెబ్బకు బార్ యజమానులు బెంబేలెత్తుతున్నారు. తమ సిండికేట్‌లో కలవాలని లేదంటే లైసెన్స్ వదిలేయాలని బెదిరిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. నేటితో గడువు ముగిసినా లైసెన్స్‌లకు దరఖాస్తులు రాకపోవడంతో అధికారులు చేసేదేమి లేక గడువును ఈ నెల 29 వరకు పెంచారు. మంగళగిరి సర్కిల్ పరిధిలో 17 బార్‌లున్నాయి. మంగళవారం నాటికి 18 దరఖాస్తులు మాత్రమే రావడంతో అధికారులు ఖంగుతిన్నారు. ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులకు మించి వస్తేనే లాటరీ ద్వారా బార్‌లు కేటాయిస్తారు. నాలుగు బార్‌లకు మాత్రమే 4 దరఖాస్తులు రాగా మిగిలిన వాటికి ఒక్కో దరఖాస్తు కూడా రాకపోవడంతో గడువు సమయం పెంచినట్లు అధికారులు తెలిపారు. ఓ ఫైనాన్స్ వ్యాపారి సిండికేట్‌కు నాయకత్వం వహిస్తూ లైసెన్స్‌ల కొరకు దరఖాస్తులు చేసే వారిని బెదిరింపులకు గురి చేస్తున్నట్లు టీడీపీలో తీవ్ర చర్చ జరుగుతుంది. ఇప్పటికే నగరంలో 17 వైన్స్ ఉండగా 17 బార్‌లకు లైసెన్స్‌లు ఆహ్వానించడం విశేషం. టీడీపీ నాయకుడు కాకపోయినా ఫైనాన్స్ వ్యాపారి అన్నీ తానేనని ఏ బార్ లైసెన్స్ కావాలన్నా తనను కలిసిన అనంతరమే దరఖాస్తు చేయాలని హుకుం జారీ చేయడంతో బార్‌లలో వాటాలు అడుగుతున్నట్లు తెలిసింది. దీంతో బార్‌ల వ్యాపారులు ఆచితూచి అడుగులు వేస్తుండడంతో లైసెన్స్‌లకు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వం లైసెన్స్‌లకు గడువు పెంచింది.

మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న చలపతి విద్యా సంస్థల చైర్మన్ ఆంజనేయులు

తాడికొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వాడటం మంచిదని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మట్టి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు, డీన్ డాక్టర్ వీవీ సుబ్బారావు, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. అలాగే తాడికొండ బీఎస్ఎస్‌బీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో తాడికొండలో 300 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ విద్యార్థులు మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను తయారుచేసి అధ్యాపకులు, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ మాట్లాడుతూ సమాజం పట్ల బాధ్యతతో పాటు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో వర్సిటీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ ఆధ్వర్యంలో గుండిమెడ పరిసర ప్రాంతాలు, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవడం, జల కాలుష్యం తగ్గించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులను వీసీ డాక్టర్ పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకటరామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సు

మంగళగిరి టౌన్ : యువత, విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని సీసీపీయూ ప్రాజెక్ట్ మేనేజర్ గంగాభవాని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు నగర పరిధిలోని నేషనల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటెన్సిఫైడ్ ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంగాభవాని మాట్లాడుతూ హెచ్ఐవీపై అవగాహన అవసరమని, దీనికి చికిత్స కన్నా నివారణే మంచిదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తారని అన్నారు. అనంతరం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ సౌజన్య ప్రియ, ఏవో మధుబాబు, ఏఎస్ఎం ప్రత్యూష, ఓఆర్‌డబ్ల్యూ చిరంజీవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు పంపిణీ

పెదవడ్లపూడి(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడిలో రూ.4.50 లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కు పంపిణీ చేశారు. ముసునూరి గోపాలరావు అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం టీడీపీ నాయకులు బాధితుడికి అందజేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ కిరణ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు పంపిణీ

మంగళగిరి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం చిరు వ్యాపారులకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో పట్టణ టీడీపీ నాయకుడు పడవల మహేష్ తయారు చేయించిన తోపుడు, ఇస్త్రీ, బండ్లు, బడ్డీ కొట్లు, టిఫిన్ బండ్లు, ప్లాట్‌ఫామ్ రిక్షాలు చిరువ్యాపారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ రియాజ్, షేక్ ఖాదిర్ బాషా, దిడ్ల సత్యానందం, పేరం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యునికి నివాళులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏకలవ్యుని విగ్రహం ఏర్పాటు చేసి 24 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం ఏకలవ్య గిరిజన సేవా సమితి ఆధ్వర్యంలో ఏకలవ్యుని, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ ఏకలవ్యుడు త్యాగ పురుషుడని, గురువు కోరిక మేరకు బొటన వేలిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. పట్టుదల, మంచి సంకల్పం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చనడానికి ఏకలవ్యుడే నిదర్శనమని పేర్కొన్నారు. నేటి యువత ఏకలవ్యుని ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఇట్టా భాస్కర్, కట్టా వెంకటేశ్వర్లు, ఉయ్యాల శ్రీనివాసరావు, బాబూరావు, కన్నారావు, రజని, కళ్యాణి, పండు తదితరులు పాల్గొన్నారు.

మట్టితో వినాయక ప్రతిమల తయారీ



ఫిరంగిపురం: మండంలోని వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వినాయక చవితి సందర్భంగా విద్యార్థులచే మట్టితో వినాయక ప్రతిమలు తయారు చేయించినట్లు హెచ్ఎం శ్రీనివాసకార్తీక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలు పర్యావరణ హితమని చెప్పారు. అనంతరం విద్యార్థులకు మట్టితో విగ్రహాలు ఎలా తయారు చేయాలో ఉపాధ్యాయుడు కమల్‌మోహన్ నేర్పించారు. కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ సుబ్బయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా, టేబుల్స్ బహూకరణ



దుగ్గిరాల: ప్రభుత్వ పాఠశాలకు బీరువా, టేబుల్స్, కుర్చీలు దాతలు బహూకరించారని ప్రధానోపాధ్యాయులు బేతాళ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం దుగ్గిరాల మండలం చుక్కపల్లివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారులు కాజా శ్రీనివాసరావు, కాజా లక్ష్మీనారాయణ సమక్షంలో దాతలు అరిగ కిషోర్, మేకతోటి వెంకయ్య, బుర్ర రమారావు, గాలి గోపిలకు కృతజ్ఞతలు తెలిపి వారిని సన్మానించారు. కార్యక్రమంలో అంజనీదేవి, బుల్లా మరియదాసు, మదన్ మోహన్‌బాబు, ఉన్నం ప్రసాదు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలి



మంగళగిరి టౌన్: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా విద్యుత్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ నాయకులు అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పోలీస్ కాల్పుల్లో ముగ్గురు మరణించారని అన్నారు. వారిని స్మరించుకుంటూ 28న మంగళగిరి అంబేడ్కర్ సెంటర్‌లో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ జరుగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అదానీ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ వినియోగదారులను దోపిడీ చేయడానికి పూనుకుందని విమర్శించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి జవహర్‌లాల్, జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: ఈ నెల 28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సందర్భంగా తాడేపల్లి పట్టణంలో పలు ప్రాంతాల్లో జరిగే సమావేశాలను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు కోరారు. మంగళవారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఆదేశాలకు తలొగ్గి అప్పటి టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని, దానిని వ్యతిరేకిస్తూ జరిగిన పోరాటంలో ముగ్గురు అసువులు బాసారని పేర్కొన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, డి.వి.భాస్కర్‌రెడ్డి, బర్నబాస్, సీపీఐ నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం లైన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మహానగర్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టెస్ట్ గవర్నర్ అన్నపురెడ్డి కోటిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్ కోసం ఇష్టపడి చదవాలని అన్నారు. విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. హెచ్ఎం జోజప్ప, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ జవహర్‌లాల్, క్లబ్ విజయవాడ మహానగర్ సెక్రటరీ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ మండల అధ్యక్షుడిగా వంగా పోలారెడ్డి

మేడికొండూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షేక్ రబ్బాని



వంగా పోలారెడ్డి



షేక్ రబ్బాని

తాడికొండ: తాడికొండ మండల అధ్యక్షుడిగా తాడికొండ గ్రామానికి చెందిన వంగా పోలారెడ్డిని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం ప్రకటన జారీ చేసింది. ఆయన గతంలో తాడికొండ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా రెండుసార్లు, జిల్లా రైతు సలహా సంఘ సభ్యుడిగా ఒక పర్యాయం పదవులు నిర్వహించగా ప్రస్తుతం తాడికొండ గ్రామ అధ్యక్షుడిగా పనిచేస్తుండగా పార్టీ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

మేడికొండూరు మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని మంగళగిరిపాడు గ్రామానికి చెందిన షేక్ రబ్బానీని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన జారీ చేసింది. ఆయన ప్రస్తుతం మేడికొండూరు మండలం మంగళగిరిపాడు గ్రామ సర్పంచ్‌గా పనిచేస్తుండగా ముస్లిం మైనార్టీ వర్గానికి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కేటాయించడంతో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పార్టీ పదవులు ఇచ్చినందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు (డైమండ్)కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషిచేస్తూ 2029 ఎన్నికల్లో తాడికొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన



పరీక్షలు చేస్తున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి

తాడికొండ: తాడికొండలోని గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రముఖ న్యూరాలజీ వైద్యులు డాక్టర్ సుందరాచారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 32 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడికొండ గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో రోగుల సౌకర్యార్థం, ఈసీజీ, గర్భిణుల కోసం స్కానింగ్ యంత్రం వంటివి అందుబాటులో ఉంచడం జరిగిందని అందరూ ఉపయోగించుకోవాలన్నారు.

ప్రతి మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా న్యూరాలజీ సంబంధిత పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.